

మండపం క్యాంప్ వద్ద దిగుతున్న హెలికాప్టర్

6న రామేశ్వరానికి మోదీ

● అపాయింట్‌మెంట్ కోరిన ఈపీఎస్

చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6న రామేశ్వరం ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. ప్రధాని కోసం మండపం క్యాంప్ హెలిపాడ్‌లో మంగళవారం ఉదయం వైమానిక దళానికి చెందిన రెండు హెలికాప్టర్లతో ట్రయల్ రన్ నిర్వహించారు. అదే సమయంలో రామేశ్వరంలో ప్రధాని మోదీని కలుసుకునేందుకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) అపాయింట్‌మెంట్ కోరారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చొరవ మేరకు బీజేపీ, అన్నాడీఎంకే మధ్య పొత్తు ఖరారు చేసుకునే విషయమై మోదీతో ఈపీఎస్ చర్చలు జరుపనున్నట్లు తెలుస్తోంది. అధికారిక సమాచారం మేరకు ఈ నెల 6న ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి మదురై విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుండి వైమానిక దళం హెలికాప్టర్‌లో రామేశ్వరం మండపం క్యాంప్ సమీపంలో ఉన్న హెలిపాడ్‌లో దిగుతారు. అక్కడి నుండి కారులో పాంబన్ వంతెన ప్రాంతానికి చేరుకుంటారు. కొత్త వంతెనను అధికారులతో కలిసి పరిశీలించిన తర్వాత ఆ వంతెన ప్రారంభోత్సవం కోసం రామేశ్వరం బస్‌స్టేషన్ సమీపంలో వేదిక ప్రాంతానికి చేరుకుంటారు. ఆ ప్రత్యేక వేదికపై నుండి మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రూ.550 కోట్లతో నిర్మించిన పాంబన్ వంతెనను ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో మోదీ పర్యటనను పురస్కరించుకుని సుమారు ఐదువేలమందికి పైగా పోలీసులతో రామేశ్వరం అంతటా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మోదీ తన పర్యటనలో భాగంగా పర్వతవర్థినీ సమేత రామనాథస్వామివారి ఆలయాన్ని కూడా సందర్శించనున్నారు. దీంతో ఆ ఆలయం చుట్టూ ఉన్న ప్రాంతాల్లో ఇప్పటికే మఫ్టీలో పోలీసులు నిఘా వేస్తున్నారు. మంగళవారం ఉదయం నుండి తూత్తుకుడి, తిరునల్వేలి, కన్నియాకుమారి, విరుదునగర్ తదితర జిల్లాల నుండి సాయల్‌కుడి ఈస్ట్‌కోస్ట్‌రోడ్డు మీదుగా రామనాథపురం, రామేశ్వరం వైపు వచ్చే అన్ని వాహనాలను సముద్రతీర భద్రతాదళం ఏఎస్పీ ఆదేశాలతో ఎస్‌ఐ పాల్‌రాజ్ ప్రత్యేక బృందం తనిఖీ చేసిన మీదటే అనుమతిస్తున్నారు.

ఇదిలా ఉండగా ప్రధాని నరేంద్రమోదీని కలుసుకునేందుకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు మదురైలో ప్రధాని మోదీతో భేటీ కోసం అపాయింట్‌మెంట్ కోరుతూ ప్రధాని కార్యాలయానికి లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఇటీవల అమిత్‌షాతో ఈపీఎస్ భేటీ తరువాత అన్నాడీఎంకే సీనియర్ నాయకుడు, సెంగోట్టయ్యన్ కూడా అమిత్‌షాతో రహస్యంగా సమావేశమయ్యారు. అన్నాడీఎంకేలో జరుగుతున్న అంతర్గత విభేదాలను మరచి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు దిశగా తదుపరి చర్యలు తీసుకోమంటూ సెంగోటయ్యన్‌కు అమిత్‌షా సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితులలోనే ప్రధాని మోదీతో భేటి అయ్యేందుకు ఈపీఎస్ అప్పాయింట్‌మెంట్ కోరినట్లు అన్నాడీఎంకే వర్గాలు చెబుతున్నాయి.

నీరు గార్చారు



'ఉంగల్ తొగుదియిల్ ముదలమైచ్చర్'పై వాగ్యుద్ధం

- మా వినతులు తిరస్కరిస్తున్నారు :ఎడప్పాడి
- ఎవ్వరిపైనా వివక్ష లేదు
- అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తున్నాం : సీఎం స్టాలిన్

అడయార్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి నియోజకవర్గంలోనూ అభివృద్ధి పనుల కోసం 'ఉంగల్ తొగుదియిల్ ముదలమైచ్చర్' అనే పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ప్రకటించిన ప్రభుత్వం.. అన్నాడీఎంకే సభ్యులు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల్లో మాత్రం ఒక్క పని కూడా చేయడం లేదని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధ్వజమెత్తారు. ఈ ఆరోపణలను సీఎం స్టాలిన్‌తో పాటు ప్రజాపనుల శాఖామంత్రి ఏవీ వేలు తిప్పికొట్టారు. అన్నాడీఎంకే సభ్యుడు, మాజీ మంత్రి విజయభాస్కర్ వంటి కొందరు సభ్యుల నుంచి వినతులు రాకపోయినప్పటికీ తానే స్వయంగా మాట్లాడి అభివృద్ధి పనులకు దరఖాస్తులు స్వీకరించినట్టు సీఎం స్టాలిన్ చెప్పారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం జరిగిన సభా కార్యక్రమాల్లో ప్రజాపనుల శాఖ అనుబంధ పద్దులపై చర్చ జరిగింది. ఈ చర్చలో అన్నాడీఎంకే సభ్యుడు దిండిగల్ శ్రీనివాసన్ మాట్లాడుతూ.. 'ఉంగల్ తొగుదియిల్ ముదలమైచ్చర్' కింద సమర్పించిన వినతులను తిరస్కరించారన్నారు. దీనికి మంత్రి వేలు స్పందిస్తూ, 'ఉంగల్ తొగుదియిల్ ముదలమైచ్చర్' కింద అన్ని నిజయోకవర్గాల్లో అభివృద్ధి పనులు ఎలాంటి వివక్ష లేకుండా జరుగుతున్నాయన్నారు. సభ్యులు కోరే వినతుల్లో అసాధ్యమైనవి మినహా అన్నింటికి అనుమతులిస్తున్నామన్నారు. వెంటనే విపక్ష నేత ఈపీఎస్ కలుగజేసుకుని, అసాధ్యమైన పనులు చేయాలని ఎవరూ కోరడం లేదని, చిన్న చిన్న పనులు పూర్తి చేయాలని కోరిన వినతులను కూడా తోసిపుచ్చుతున్నారన్నారు. తన నియోజవర్గంలో పది అభివృద్ధి పనులు చేపట్టాలని కోరగా కేవలం రెండింటిని మాత్రమే పూర్తి చేశారన్నారు.

దీనికి సీఎం స్టాలిన్ కలుగజేసుకుని 'మీ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నేనే స్వయంగా పర్యవేక్షిస్తున్నాను. మాజీ మంత్రి విజయభాస్కర్ వైపు నుంచి ఒక్క వినతి పత్రం కూడా రాకపోతే నేనే మాట్లాడి కొన్ని పనులకు దరఖాస్తులు స్వీకరించాను. ఏ నియోజకవర్గంపైనా మేం వివక్ష చూపడం లేదు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి వున్నాం' అని సమాధానమిచ్చారు.


తిరుచ్చి గ్రంథాలయానికి కామరాజర్ పేరు

● అసెంబ్లీలో ప్రకటించిన సీఎం స్టాలిన్



శాసనసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి

చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి నగరంలో రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్న గ్రంథాలయానికి మాజీ ముఖ్యమంత్రి దివంగత కామరాజర్ పేరు పెట్టనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. మంగళవారం ఉదయం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో కుంభకోణం శాసనసభ్యుడు కె.అన్బళగన్ జిల్లాల వారీగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న గ్రంథాలయాల కోసం అడిగిన ప్రశ్నకు సీఎం సమాధానమిస్తూ.. ఇటీవల ప్రజాపనుల శాఖ గత నాలుగేళ్లలో సాధించిన ప్రగతిపై వేసిన పుస్తకాన్ని తాను పరిశీలించానని, అందులో జిల్లా కేంద్రం తిరుచ్చిలో రూ.290 కోట్లతో నిర్మించనున్న గ్రంథాలయానికి కలైంజర్ కరుణానిధి పేరు పెట్టనున్నట్లు చూసి ఆశ్చర్యపోయానని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి హయాంలో కోట్టూరుపురంలో ప్రారంభించిన గ్రంథాలయానికి అన్నాదురై పేరు పెట్టారని, మదురైలో డీఎంకే ద్రావిడ తరహా పాలనలో తన చేతుల మీదుగా ప్రారంభించిన గ్రంథాలయానికి కలైంజర్ కరుణానిధి పేరు పెట్టామని చెప్పారు. మదురైలోని గ్రంథాలయానికి ఇప్పటివరకూ 16 లక్షలమంది వరకు సందర్శించి లబ్ధిపొందినట్లు తెలుసుకుని తానెంతో సంతోషించానన్నారు. ఇటీవల కోయంబత్తూరులో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు అక్కడ కూడా అంతర్జాతీయ స్థాయి గ్రంథాలయాన్ని నిర్మించనున్నట్లు హామీ ఇచ్చానని, ఆ మేరకు ఆ గ్రంథాలయానికి శంకుస్థాపన జరిగి నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇదే విధంగా తిరుచ్చిలోనూ గ్రంథాలయ నిర్మాణానికి మార్చిలో తాను శంకుస్థాపన చేశానని, ప్రస్తుతం ఆ గ్రంథాలయ నిర్మాణ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కోయంబత్తూరులో నిర్మించనున్న గ్రంథాలయానికి ద్రవిడ ఉద్యమనేత పెరియార్ పేరు పెట్టనున్నామని, తిరుచ్చిలో నిర్మిస్తున్న గ్రంథాలయానికి బడిపిల్లలకు పౌష్టికాహార పథకాన్ని అమలు చేసిన మహనీయుడు, మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ పేరు పెట్టడం చాల సముచితంగా ఉంటుందని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై పాఠశాలల విద్యాశాఖ మంత్రి ఉత్తర్వు జారీ చేయాలని సభ్యుల హర్షధ్వానాల నడుమ సీఎం సూచించారు.



ఊటీ, కొడైకెనాల్‌లో ఈ-పాస్ ప్రారంభం

● లేకుంటే వాహనాలకు అనుమతి లేదు



నీలగిరి జిల్లా సరిహద్దులో వాహనాల ఈ-పాస్ పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీ భవ్య

ప్యారీస్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన వేసవి విడిది ప్రాంతాలైన నీలగిరి జిల్లా ఊటీ, దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌లకు వాహనాల రద్దీ తగ్గించేందుకు రూపొందించిన ఈ-పాస్ విధానం మంగళవారం నుంచి అమలులోకి వచ్చింది. నీలగిరి జిల్లాకు ప్రతి ఏడాది 30 లక్షల మందికి పైగా పర్యాటకులు వస్తుంటారు. ముఖ్యంగా, ఏప్రిల్, మే నెలల్లో రోజుకు 30వేల మంది ఇక్కడికి రావడంతో వాహనాల రద్దీ నెలకొంటుంది. పర్యాటకుల సంఖ్య నియంత్రించేందుకు, పర్యావరణాన్ని పరిరక్షించేలా ఊటీ, కొడైకెనాల్ ప్రాంతాలకు వెళ్లే వాహనాల సంఖ్య తగ్గించేలా ఈ-పాస్ విధానం అమలుచేయాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ ప్రకారం, మంగళవారం (ఏప్రిల్ 1వ తేది) నుంచి జూన్ చివరివారం వరకు, ప్రతి సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజుకు 6వేలు వాహనాలు, శని, ఆదివారాల్లో 8వేలు వాహనాలను మాత్రమే నీలగిరి జిల్లాలోకి అనుమతించనున్నట్లు రాష్ట్ర పర్యాటక, ఉద్యానవన శాఖల అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, నీలగిరి జిల్లా రిజిస్ట్రేషన్ కలిగిన వాహనాలు, అంబులెన్స్‌లు, వైద్య సేవలకు సంబంధించిన వాహనాలకు ఈ-పాస్ విధానం నుంచి జిల్లా యంత్రాంగం మినహాయింపు కల్పించింది. జిల్లా సరిహద్దుల్లో ఉన్న కల్లారు, కుంజప్పనై, ముల్లి, సుక్కానల్లా, పట్టవయల్, కేరంబాడి తదితర ప్రాంతాల్లోని చెక్‌పోస్ట్‌ల్లో ఈ-పాస్ ఉన్న వాహనాలు మాత్రమే అనుమతిస్తున్నారు. అదే విధంగా, దిండుగల్ జిల్లాలోని కొడైకెనాల్‌లో కూడా ఈ-పాస్ విధానం అమలులోకి వచ్చింది. జిల్లా రిజిస్ట్రేషన్ నెంబర్లు కలిగిన వాహనాలు మినహాయించి మిగతా వాహనాలు రోజుకు 4వేలు, శని, ఆదివారాల్లో 6వేల వాహనాలను మాత్రమే అనుమతించనున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. కొండపైకి వెళ్లే వాహనాల వల్ల కలిగే రద్దీ నియంత్రించేలా అబ్జర్వేటరీ, రోజ్ గార్డెన్, బ్రియాంట్ పార్క్ రోడ్డు ప్రాంతాల్లో తాత్కాలిక పార్కింగ్ ఏర్పాటు చేశారు. పర్యాటకులతో సంప్రదింపులు జరిపేలా జిల్లా యంత్రాంగం క్యూ ఆర్ కోడ్ సదుపాయం కూడా కల్పించింది. ఇదిలా ఉండగా, నీలగిరి, కొడైకెనాల్ ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు ఈ-పాస్ విధానం అమలుకు రావడంతో, ఈ-పాస్‌ల కోసం కౌంటర్ల వద్ద వాహనాల్లో వచ్చిన పర్యాటకులు బారులుతీరారు.

కారును ఢీకొన్న లారీ

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి



చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా సింగపెరుమాళ్ కోవిల్ సమీపంలో సోమవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన యేడాది బిడ్డ సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మదురై సికందవాడి సమీపం పొదుంబూరు జానకి నగర్‌కు చెందిన అయ్యనార్ (70), ఆయన భార్య దైవ పూంజారి (52), వీరి కుమారుడు శరవణన్ (24), కుమార్తె నందిని (32), అల్లుడు కార్తిక్, ఈ దంపతుల కుమార్తె ఇలమది (7) కుమారుడు సాయివేలన్ (1) సోమవారం ఉదయం మదురై నుండి కారులో చెన్నై వచ్చారు. చెన్నైలో బంధువుల ఇంట జరిగిన శీమంతం వేడుకల్లో పాల్గొని రాత్రి అందరూ తిరిగి మదురై పయనమయ్యారు. రాత్రి 10.30 గంటల సమయంలో సింగపెరుమాళ్ కోవిల్ తిరుత్తేరి జీఎస్టీరోడ్డు కూడలిలో సిగ్నల్ వద్ద కారు ఆగింది. ఆ కారు ముందు 24 అడుగుల పొడవైన కంటైనర్ లారీ ఆగి ఉంది. ఆ సమయంలో మరొక లారీ వేగంగా వస్తూ అదుపుతప్పి అయ్యనార్ కుటుంబీకులు ఉన్న కారును వెనుక వైపు ఢీకొంది. దీంతో ఆ కారు ముందున్న కంటైనర్ లారీని ఢీకొంది. క్షణాల్లో రెండు లారీల మధ్యలో ఆ కారు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో అయ్యనార్, ఆయన కుమారుడు శరవణన్, మనుమడు సాయి వేలన్ తీవ్రంగా గాయపడి మరణించారు. దైవపూంజారి, నందిని, కార్తిక్, ఇలమది, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ఆంటోని రాజ్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంపై సమాచారం అందగానే పుత్తేరి ట్రాఫిక్‌పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ ఆంటోని రాజ్‌ను మెరుగైన చికిత్సకోసం చెన్నై జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా ఆ మార్గంలో గంటకు పైగా వాహనాల రాకపోకలు ఆగిపోయాయి.

కావేరి-గుండారు-వైగై నదుల అనుసంధానం

అసెంబ్లీలో మంత్రి దురైమురుగన్ ప్రకటన



ప్యారీస్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు కావేరి-వైగై-గుండారు నదుల అనుసంధానం చేసి తీరుతామని అసెంబ్లీలో మంగళవారం మంత్రి దురైమురుగన్ ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఉదయం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలో నీటి కొరత పరిష్కరించేలా నదులు అనుసంధానం చేస్తారా అని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి సి.విజయభాస్కర్ ప్రశ్నించారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన కావేరి-వైగై-గుండారు నదుల అనుసంధానం పథకం పనులు వేగవంతం చేసినట్లయితే, పుదుకోట జిల్లాలో ఉన్న రైతులు లబ్ధిపొందుతారని, వేలాది ఎకరాల భూములకు సాగు నీరు అందుతుందని తెలిపారు. పుదుకోట, శివగంగ, రామనాథపురం జిల్లాల్లో సాగు, తాగునీటి కొరత అధికమవుతోందని, ఈ సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని వర్షాకాలం ప్రారంభం కాకముందే నదుల అనుసంధానం చేయాలని సూచించారు. అదే సమయంలో, ప్రస్తుత బడ్జెట్‌లో నదులు అనుసంధానానికి నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. దీనిపై నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ సమాధానమిస్తూ... ఈ పనుల నిమిత్తం 2022లో కేటాయించిన రూ.146 కోట్లలో ఇప్పటివరకు రూ.116 కోట్లు ఖర్చయిందని, 47 శాతం కాలువ తవ్వకాల పనులు పూర్తయ్యాయని వివరించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.176 కోట్లు కేటాయించి అందులో రూ.128 కోట్లు ఖర్చుచేశామని, 86 శాతం కాలువ తవ్వకాల పనులు పూర్తయ్యాయన్నారు. ఈ సంవత్సరం కేటాయించిన రూ.50 కోట్ల నిధులలో ఇప్పటివరకు రూ.33 కోట్లు ఖర్చయిందని, 89 శాతం కాలువ తవ్వకాలు పూర్తయ్యాయని, మిగతా పనులు రెండు నెలల్లో పూర్తిచేయాలని ఉత్తర్వులు జారీచేసినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు మినహాయించి భూసేకరణ పనులు ప్రారంభించామని కరూర్, తిరుచ్చి జిల్లాల్లో నీటిపారుదల పనుల కోసం రూ.376 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వ పరిశీలనను పంపినట్లు మంత్రి వివరించారు.

జీసీసీ చరిత్రలో

సరికొత్త రికార్డు!

● రూ.2,025 కోట్ల ఆస్తి పన్ను వసూలు

పెరంబూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో గత ఆర్థిక సంవత్సరంలో రూ.2,025 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. కార్పొరేషన్ చరిత్రలోనే రూ.2 వేల కోట్లకు పైగా ఆస్తి పన్ను వసూలు కావడం ఇదే తొలిసారి. జీసీసీ పరిధిలో 13 లక్షల మందికి పైగా యజమానులు పన్ను చెల్లిస్తున్నారు. ఆరు నెలలకు ఒకసారి ఏప్రిల్, అక్టోబరు నెలల్లో రెండు విడతలుగా ఆస్తి పన్ను వసూలు చేస్తారు.. గత 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,750 కోట్లు ఆస్తి పన్ను వసూలైంది. ఈ క్రమంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూళ్లు రూ.2వేల కోట్లు లక్ష్యంగా నిర్ణయించారు. లక్ష్య సాధనకు నెలరోజులుగా కార్పొరేషన్ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పన్ను వసూళ్లు చేపట్టారు.



సెలవు రోజుల్లోనూ పన్ను వసూలు ..

అపార్ట్‌మెంట్ సంఘాల సహకారంతో ప్రత్యేక పన్ను వసూలు కేంద్రాలను జీసీసీ ఏర్పాటుచేసింది. గత నెల 29 నుంచి 31వ తేది వరకు మూడు రోజులు ప్రభుత్వ సెలవురోజులైనా, ఆస్తి పన్ను చెల్లించవచ్చని కార్పొరేషన్ ప్రకటించింది. సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రిప్పన్ భవనంలోని కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో కార్పొరేషన్ రెవెన్యూ అధికారి భానుచంద్రన్ పర్యవేక్షణలో పన్ను వసూళ్లు జరిగాయి. ఆ ప్రకారం, గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.2,025 కోట్లు ఆస్తి పన్ను వసూలుచేశారు. కార్పొరేషన్ చరిత్రలోనే రూ.2 వేల కోట్ల ఆస్తి పన్ను వసూలు కావడం ఇదే తొలిసారి. గత ఏడాది తో పోల్చితే ఈ ఏడాది పన్ను వసూళ్ల రూ.275 కోట్లు అధికం. అలాగే వాణిజ్య పన్నుగా రూ.570 కోట్లు వసూలుచేశారు. గత ఏడాదితో పోల్చితే రూ.38 కోట్లు అధికం. ఇక, మంగళవారం నుంచి చెల్లించే గత ఏడాది పన్నుకు 2 శాతం వడ్డీ వసూలు చేయనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి అర్ధవార్షిక ఆస్తి పన్ను మంగళవారం నుంచి ఈ నెల 30వ తేది వరకు చెల్లిస్తే, అందులో 5 శాతం, అధికంగా రూ.5,000 వరకు రాయితీ అందజేయనున్నట్లు కార్పొరేషన్ ప్రకటించింది.

జూన్‌లోగా విక్టోరియా హాలు పునరుద్ధరణ

● మేయర్ ప్రియ



పెరంబూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విక్టోరియా హాలు పునరుద్ధరణ పనులు జూన్ నెలలోగా పూర్తిచేయాలని మేయర్ ప్రియ అధికారులను ఆదేశించారు. జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనం పక్కనే ఉన్న విక్టోరియా ఆడిటోరియంను 'సింగార చెన్నై 2.0' పథకంలో రూ.32 కోట్లతో, భవనం ప్రాచీనత చెక్కు చెదరకుండా పునరుద్ధరణ పనులను 2023లో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి ప్రారంభించారు. రాష్ట్రంలో పలు మార్పులు తీసుకొచ్చిన జస్టిస్ పార్టీ విక్టోరియా హాలు నిర్మించింది. ఈ భవనం ప్రత్యేకతను ప్రజలు తెలుసుకొనేలా మ్యూజియం, మొదటి అంతస్తులో ఆర్ట్ గ్యాలరీ నిర్మిస్తున్నారు.. పునరుద్ధరణ పనులు పరిశీలించిన జీసీసీ మేయర్ ప్రియ, జూన్ నెలలోపు పనులు పూర్తిచేసేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

సమాచార దృష్టి

జూన్ 15న గ్రూప్-1 ప్రిలిమినరీ

పెరంబూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నోటిఫికేషన్‌ను తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) విడుదల చేసింది. గ్రూప్-1 ప్రిమిలినరీ పరీక్షకు మంగళవారం నుంచి ఈ నెల 20వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల వివరాల్లో లోపాలు ఉండే మే 5 నుంచి 7వ తేది వరకు సవరించుకోవచ్చు. ప్రిలిమినరీ పరీక్ష జూన్ 15వ తేది నిర్వహించనుండగా, మెయిన్స్ తేది తర్వాత ప్రకటిస్తారు. మొత్తం 70 పోస్టులు భర్తీచేయనున్నారు. డిగ్రీ పూర్తి చేసిన వారు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు https://www.tnpsc.gov.in/Document/english/Group%20IA%20Notification_Engilsh_pdf అనే లింక్ క్లిక్ చేసి తెలుసుకోవచ్చని టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

డెహ్రాడూన్ సైనిక పాఠశాలలో అడ్మిషన్లు

పెరంబూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో ఉన్న రాష్ట్రీయ భారత సైనిక కళాశాలలో 2026 విద్యా సంవత్సరంలో 8వ తరగతిలో అడ్మిషన్లకు జూన్ 1వ తేది ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇంగ్లీషు, అకౌంటెన్సీ, జనరల్ నాలెడ్జ్ విభాగాల నుంచి ప్రవేశ పరీక్ష జరుగనుంది.. అకౌంట్స్‌జనరల్‌నాలెడ్జ్ పేపర్లకు ఇంగ్లీషు, హిందీలో సమాధానాలు రాయాల్సి ఉంటుంది. దరఖాస్తులు పరిశీలించి అర్హులైన వారిని మాత్రమే ప్రవేశ పరీక్షకు అనుమతించనున్నారు.2013జనవరి 2నుంచి2014 జూలై 1వ తేదిలోపు జన్మించిన వారు www.rimc.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

పెరంబూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్-రామనాథపురం-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, నెం.07695 సికింద్రాబాద్-రామనాథపురం ప్రత్యేక రైలు ఈ నెల 2,9,26,23,30 తేదీల్లో సికింద్రాబాద్‌లో రాత్రి 9.10 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు రామనాథపురం చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.07696 రామనాథపురం-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 4,11,18,25,మే 2వ తేదీల్లో రామనాథపురంలో ఉదయం 9.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్ల ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైందని అధికారులు తెలిపారు.

తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

పెరంబూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో వాణిజ్య వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.43.50 తగ్గి రూ.1,921.50కి విక్రయమవుతోంది.ప్రజా శాఖకు చెందిన పెట్రోలియం సంస్థలు వాణిజ్య వినియోగానికి 19 కిలోల గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తుంటాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలకు అనుకూలంగా, దేశంలో ప్రతినెలా మొదటి రోజున, గ్యాస్ సిలిండర్ ధరలో మార్పు చేస్తుంటారు. ఆ క్రమంలో, మంగళవారం (ఏప్రిల్ 1వ తేది) వాణిజ్య సిలిండర్ ధర రూ.43.50 తగ్గి రూ.1,921.50కి విక్రయమవుతోంది. గత నెల వాణిజ్య సిలిండర్ రూ.1,965కు విక్రయమైంది. కాగా, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు.

పెరిగిన బీరు విక్రయాలు

పెరంబూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని టాస్మాక్ మద్యం దుకాణాల్లో బీరు విక్రయాలు 30 శాతం పెరిగాయి. సాధారణంగా శీతాకాలంలో బ్రాందీ, విస్కీ, రమ్ తదితర మద్యం రకాల విక్రయాలు అధికంగా ఉంటాయి. వేసవిలో బీరు విక్రయాలు ఎక్కువగా జరుగుతాయి.. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు పెరగడంతో మద్యం దుకాణాల్లో బీరు విక్రయాలు ఊపందుకున్నాయి.

లండన్, తూత్తుకుడి వెళ్లాల్సిన నాలుగు విమానాల రద్దు

పెరంబూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి లండన్, తూత్తుకుడికి వెళ్లాల్సిన నాలుగు విమానాలు హఠాత్తుగా రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. లండన్ నుంచి సోమవారం బయల్దేరే బ్రిటీష్ ఎయిర్‌వేస్ విమానం మంగళవారం తెల్లవారుజామున 5.35 గంటలకు చెన్నై వచ్చి, మళ్లీ ఇక్కడి నుంచి లండన్ వెళ్తుంది. నిర్వహణ కారణాలతో ఈ రెండు సేవలు రద్దు చేశారు. అలాగే, చెన్నై నుంచి తూత్తుకుడి, తూత్తుకుడి నుంచి చెన్నై విమాన సర్వీసులు కూడా రద్దయ్యాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

పాఠశాలల విద్యుత్ ఛార్జీలు చెల్లించనున్న ప్రభుత్వం

పెరంబూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉన్నత, మహోన్నత పాఠశాలల విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వమే చెల్లించనుంది. మే నెల నుంచి ఈ విధానం అమలుకు రానుంది. ప్రస్తుతం ప్రాథమిక విద్య పరిధిలోని ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల విద్యుత్ ఛార్జీలు సంబంధించి తాలూకా విద్యా కార్యాలయాలు, ప్రభుత్వ ఉన్నత, మహోన్నత పాఠశాలల విద్యుత్ ఛార్జీలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెల్లిస్తున్నారు. పాఠశాలలకు ఏడాదికి రెండుసార్లు ఇచ్చే చిల్లర ఖర్చుల నుంచి విద్యుత్ ఛార్జీల చెల్లింపుకు కేటాయిస్తున్నారు. అదే సమయంలో, అధిక శాతం మంది ప్రధానోపాధ్యాయులు తమ సొంత డబ్బులే విద్యుత్ ఛార్జీ కోసం చెల్లిస్తున్నారు. ప్రస్తుతం హైటెక్ ల్యాబ్, డిజిటల్ తరగతులు ఏర్పాటుతో విద్యుత్ ఛార్జీలు రెట్టింపు అయ్యాయి. ఈ నేపథ్యంలో, 9,000 ఉన్నత, మహోన్నత పాఠశాలల విద్యుత్ కనెక్షన్ నెంబర్లు ఐఎఫ్ఎస్.ఆర్ఎంఎస్ అనే వెబ్‌సైట్‌లో నమోదుచేశారు. ప్రయోగాత్మకంగా తేని, విల్లుపురం, కళ్లకుర్చి జిల్లాల్లోని పాఠశాలలకు విద్యుత్ ఛార్జీలు అందజేస్తున్నారు. మే 1వ తేది నుంచి అన్ని జిల్లాలకు ఈ విధానం అమలుకు రానుందని ప్రభుత్వం తెలియజేసింది.

ఎస్వీ బిల్డర్స్ కార్యాలయం ప్రారంభం

వేలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేలూరు కాట్పాడి సమీపంలోని సెంగోట్టైలోవున్న ఎస్వీ బిల్డర్స్ కార్యాలయాన్ని ఎంపీ కదిర్ ఆనంద్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని, ప్రజాభివృద్ధే తమ పార్టీ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాట్పాడి మండల కార్యదర్శి వన్నియరాజా, 1వ వార్డు అధ్యక్షురాలు పుష్పలత, కౌన్సిలర్లు అన్బు, లోగనాథం తదితరులు పాల్గొన్నారు.

మదురైలో ఎన్‌కౌంటర్: రౌడీ సుభాష్ హతం


రౌడీ సుభాష్‌చంద్రబోస్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మదురై రింగ్‌రోడ్డులో సోమవారం రాత్రి పోలీసుల ఎన్‌కౌంటర్‌లో పేరుమోసిన రౌడీ సుభాష్ చంద్రబోస్ (26) హతమయ్యాడు. ఈ నెల 22న మదురైలో జరిగిన గ్లామర్ కాళి అనే రౌడీ హత్యకేసులో ఇతడు ప్రధాన నిందితుడని పోలీసులు తెలిపారు. గ్లామర్ కాళి హత్యకేసులో ఇదివరకే ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత సుభాష్ చంద్రబోస్ ఆచూకీకోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మదురై చింతామణి ప్రాంతంలో మారణాయుధాలతో సుభాష్ చంద్రబోస్ సంచరిస్తున్నాడనే సమాచారం అందటంతో పోలీసులు హుటాహుటిన అక్కడికిచేరుకుని అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో సుభాష్ మారణాయుధాలతో పోలీసులపై ఎదురుదాడికి దిగాడు. ఈ సంఘటనలో ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. దీంతో ఎస్ఐ భూమినాథన్ కాల్పులు జరుపటంతో సుభాష్ గుండెలోకి తూటాలు దూసుకుపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గాయపడిన కానిస్టేబుళ్లను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుభాష్ చంద్రబోస్ మృత దేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మదురై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలాన్ని పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు.

ప్రభుత్వ పిటిషన్ విచారణకు అర్హత లేదు

● హైకోర్టుకు ఈడీ వివరణ

పెరంబూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (ఈడీ) చట్టబద్ధమైన దర్యాప్తుకు అంతరాయం కలిగించేలా తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదు. తనిఖీలకు వ్యతిరేకంగా ఈడీకి అప్పీలు చేసే అవకాశం ఉన్నా, అలాంటివేమీ లేకుండానే నేరుగా హైకోర్టును ఆశ్రయించడం తప్పు. అందువల్ల ఈ పిటిషన్‌పై జరిమానా విధించి, తోసిపుచ్చండి' అని ఈడీ హైకోర్టుకు విన్నవించింది. టాస్మాక్ ప్రధాన కార్యాలయంలో గత నెల 6 నుంచి 8వ తేది వరకు తనిఖీ చేసిన ఈడీ అధికారులు.. టాస్మాక్ సంస్థ చేపట్టిన మద్యం కొనుగోళ్లు, బార్లకు అనుమతి, దుకాణాలకు మద్యం తీసుకెళ్లేలా రవాణా టెండర్లు తదితరాల్లో రూ.1,000 కోట్లకు పైగా అవినీతి జరిగినట్లు తేల్చిన విషయం తెలిసిందే. అయితే ఈడీ తనిఖీలు రాజ్యాంగానికి విరుద్ధమని, ప్రభుత్వ అనుమతి లేకుండా చేపట్టిన తనిఖీలను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించాలని అభ్యర్థిస్తూ రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి, టాస్మాక్ మేనేజింగ్ డైరెక్టర్ మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన న్యాయమూర్తులు ఎంఎస్ రమేష్, ఎన్.సెంథిల్‌కుమార్ విచారణ నుంచి వైదొలుతున్నట్లు ప్రకటించారు. దీంతో ఈ పిటిషన్లు మంగళవారం న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణియం, కె.రాజశేఖర్‌తో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. ఈడీ తరఫున కౌంటర్ అఫిడవిట్ దాఖలైంది. చట్టప్రకారం చేపట్టిన సోదాలను చట్టవిరుద్ధమైనవంటూ ప్రభుత్వంవేసిన పిటిషన్‌కు ఏమాత్రం విచారణార్హత లేదని అందులో పేర్కొన్నారు. అందువల్ల జరిమానా విధించి మరీ పిటిషన్‌ను తోసిపుచ్చాలని ఈడీ అభ్యర్థించింది. కాగా 60 గంటల పాటు తనిఖీలు నిర్వహించి మహిళా అధికారులను అర్ధరాత్రి వరకు నిర్బంధించారని, ఇది మానక హక్కుల ఉల్లంఘన అని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది వివరించారు. ఈడీ దాఖలుచేసిన కౌంటర్ అఫిడవిట్‌కు రీజాయిన్ అఫిడవిట్ దాఖలు చేసేందుకు అనువుగా గడువు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. రాష్ట్ర పోలీసులు తనిఖీలు చేయడం లేదా అని ప్రశ్నించింది. అందుకు ప్రభుత్వ న్యాయవాది లేదని చెప్పడంతో తదుపరి విచారణ ఈ నెల 8వ తేదీకి వాయిదా వేసింది.

ప్రధాని మెచ్చిన పథకాన్ని విమర్శిస్తారా...!

● అన్నామలైకు సెల్వపెరుందగై చురక

ప్యారీస్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ మెచ్చుకున్న పథకాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై విమర్శించడం న్యాయమా అని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై ప్రశ్నించారు. డ్రైనేజీ కాలువల్లో దిగి విషవాయువు సోకి మృతిచెందిన వారి వారసులను ఎంపిక చేసి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే పథకం దేశవ్యాప్తంగా అమలులో ఉండగా, ఈ పథకాన్ని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఈ నేపథ్యంలో మంగళవారం సచివాలయం ప్రాంగణంలో సెల్వపెరుందగై మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్న 532 కేంద్రీయ విద్యాలయ పాఠశాలల్లో ఆంగ్లం, హిందీ మీడియంలో ద్విభాషా విధానం అమలులో ఉందని, ప్రస్తుతం ఎన్నికల దగ్గర పడుతున్న సమయంలో త్రిభాషా విధానం తీసుకురావడం ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన ఉపాధి హామీ బకాయి నిధులను సత్వరం విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సెల్వపెరుందగై డిమాండ్ చేశారు.

తిరుచ్చిలో అసెంబ్లీ సమావేశాలు

● బీజేపీ ఎమ్మెల్యే విజ్ఞప్తి

ప్యారీస్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి నగరంలో వారం రోజులు అసెంబ్లీ సమావేశాలు ప్రయోగాత్మకంగా నిర్వహించాలని బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ నయినార్ నాగేంద్రన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం అసెంబ్లీలో జరిగిన రహదారులు, చిన్న ఓడరేవుల శాఖ పద్దులపై జరిగిన చర్చలో నయినార్ నాగేంద్రన్ మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ హయాంలో రెండవ రాజధాని నగరంగా తిరుచ్చిని రూపొందించాలని అఖిల పక్షాలు చేసిన విజ్ఞప్తి మేరకు, ఎంజీఆర్ ఆ దిశగా ప్రయత్నాలు చేపట్టారని గుర్తుచేశారు. తిరుచ్చిని రెండో రాజధానిగా ప్రకటించి, ప్రయోగాత్మకంగా వారం రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని, సాధ్యమైతే శీతాకాల సమావేశాలు అక్కడే జరిపితే బాగుంటుందన్నారు. అందుకు స్పీకర్ అప్పావు... దేశ రాజధాని ఢిల్లీలాగే చెన్నైని దేశ రెండవ రాజధానిగా కేంద్రం ప్రకటించాలని అభిప్రాయపడ్డారు. అందుకు నయినార్ నాగేంద్రన్... పరిస్థితులు అనుకూలిస్తే అది కూడా జరుగుతుందని చెప్పడంతో సభలో నవ్వులు విరిశాయి.

దశాబ్దాలుగా మూతపడిన ఆలయాలు తెరుచుకుంటున్నాయి

● మంత్రి శేఖర్‌బాబు

అడయార్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రిగా స్టాలిన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో దశాబ్దాలుగా మూతబడివున్న ఆలయాలు ఒక్కొక్కటి తెరుచుకుంటున్నాయని దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. సీఎం స్టాలిన్ సారథ్యంలో డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎన్నో ఏళ్ళుగా ద్వారాలు తెరుచుకోని ఆలయాలు ఒక్కొక్కటిగా తెరుచుకుంటున్నాయన్నారు. కాంచీపురం పట్టణం ఆలయాల నగరంగా ప్రసిద్ధిగాంచిందన్నారు. ఈ ఒక్క జిల్లాలోనే ఏకంగా 168 ఆలయాలు దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నాయన్నారు. డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మంది సభ్యులు తమతమ ప్రాంతాల్లోని ఆలయాల తనిఖీలకు తీసుకెళ్ళారని, వాటిని పరిశీలించి మరమ్మతులు పూర్తి చేస్తున్నామన్నారు. అంతేకాకుండా పార్టీలకు అతీతంగా సభ్యులు వినతులపై తగిన రీతిలో చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు.

రూ.25 కోట్లతో విదేశీ పక్షుల విహార కేంద్రం

● మంత్రి పొన్ముడి

అడయార్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా మరక్కాణంలో రూ.25 కోట్లతో విదేశీ పక్షుల విహార కేంద్రాన్ని నిర్మిస్తామని రాష్ట్ర మంత్రి డాక్టర్ కె.పొన్ముడి తెలిపారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మైలం గ్రామంలో వన్యప్రాణులు సంరక్షణ కేంద్రాన్ని నెలకొల్పేందుకు ప్రభుత్వం పరిశీలిస్తుందా? అని పీఎంకే సభ్యుడు శివకుమార్ ప్రశ్నించగా, మంత్రి పొన్ముడి ఈ విధంగా సమాధానమిచ్చారు. అలాగే, మయిలం గ్రామంలో వన్యప్రాణుల సంరక్షణా కేంద్రాన్ని నిర్మించేందుకు అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

● టీడీకే శ్రేణులకు విజయ్ పిలుపు

చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంతటా జూన్ వరకూ ఎండలు తీవ్రంగా ఉంటాయని వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించిన నేపథ్యంలో అన్ని నగరాల్లోనూ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పార్టీ శ్రేణులకు తమిళగ వెట్రి కళగం నాయకుడు, సినీ నటుడు విజయ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ బుధవారం నుంచి చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు మజ్జిగ, పండు, కొబ్బరి నీరు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి వీధిలోనూ ఓ చలివేంద్రం నిర్మించాలని ఆయన ఆదేశించారు.

పోలీస్ గ్రీవెన్స్‌లో 50 వినతులు


సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

పెరంబూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం పోలీసు గ్రీవెన్స్ జరిగింది. గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్‌గా బాధ్యలు చేపట్టిన అరుణ్, ప్రజల సమస్యలు తెలుకొనేలా ప్రతి బుధవారం గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే పోలీసు అధికారులు, పోలీసులు, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న వారు తమ సమస్యలు తెలిపేలా ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహించిన శిబిరంలో ఇద్దరు సహాయ కమిషనర్లు, ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్ఐలు. 36 మంది పోలీసులు వారి వారి సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందజేశారు. బదిలీ, క్వార్టర్స్ కేటాయింపు, వేతనం తగ్గింపు సహా పలు సమస్యలు తెలిపారని, వినతిపత్రాలు పరిశీలించి సత్వరం న్యాయం చేయాలని కమిషనర్ ఆదేశించినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

అన్నాడీఎంకే కార్యకర్త అరెస్టుపై ఆగ్రహం

● పోలీసుస్టేషన్‌ను ముట్టడించిన మాజీ మంత్రి


బెయిలుపై విడుదలైన అరుళ్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి విజయభాస్కర్

చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కరూరు ఆండాంకోవిల్ సమీపం గోవిందంపాళయంలో నివసిస్తున్న అరుళ్‌ను ఇంటిముందు చవుడు ఇసుక పోసి ఉంచిన నేరానికి పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ మాజీ మంత్రి విజయభాస్కర్ నాయకత్వంలో అన్నాడీఎంకే కార్యకర్తలు పోలీసు స్టేషన్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించారు. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. రెండు రోజుల క్రితం పంచాయతీ ఉద్యోగి అరుళ్ ఇంటి ముందున్న చవుడు ఇసుక గురించి ప్రశ్నించడంతో వారిద్దరి మధ్య గొడవలు జరిగాయి. దీనితో తన విధులకు ఆటంకం కలిగించారంటూ అరుళ్ పై ఉద్యోగి పళనిసామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని అరుళ్‌ను అరెస్టు చేశారు. ఈ విషయం తెలియగానే మాజీ మంత్రి విజయభాస్కర్, పార్టీ కార్యకర్తలు అర్ధరాత్రి కరూరు పోలీసుస్టేషన్ ముట్టడికి ప్రయత్నించారు. ఆ తరవాఆత బెయిలుపై విడుదలైన అరుళ్‌ను మాజీ మంత్రి విజయభాస్కర్ పరామర్శించారు.

చెన్నై, కోవై నగరాల్లో 40, 50 అంతస్తుల భవనాలు

డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి వినతి ● పరిశీలిస్తామన్న మంత్రి ముత్తుస్వామి

పెరంబూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై, కోవై తదితర నగరాల్లో దాదాపు 50 అంతస్తుల గృహ సముదాయాలు నిర్మిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, డిప్యూటీ స్పీకర్ కె.పిచ్చాండి తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ.. ఢిల్లీ, ముంబై తదితర నగరాల్లో 40,50 అంతస్తులతో కూడిన గృహ సముదాయాలను హౌసింగ్ బోర్డు నిర్మిస్తోందని, చెన్నై నగరంలో కూడా ప్రైవేటు సంస్థలు 40,50 అంతస్తులతో కూడిన గృహ సముదాయాలు ఏర్పాటు చేస్తున్నాయన్నారు. దీనికి మంత్రి ముత్తుస్వామి సమాధానమిస్తూ... హౌసింగ్ బోర్డుకు చెందిన స్థలంలో సాధ్యమైనంత వరకు బహుళ అంతస్తుల గృహ సముదాయాలు నిర్మిస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లోని రోడ్డు వసతి, విమానాశ్రయం సహా పలు అంశాలు పరిగణలోకి తీసుకొని బహుళ అంతస్తుల గృహ సముదాయాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఎఫ్ఎస్ఐ ఆధారంగా ప్లాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి సమాధానమిచ్చారు.

ఇళ్లపట్టాలపై కలెక్టర్ సర్వే


ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న కలెక్టర్ ఎం.ప్రతాప్

తిరుత్తణి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణిలోని అనధికారిక స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేద కుటుంబాలకు ఇళ్లపట్టాలు అందజేయాలనే ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు మంగళవారం తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఎం.ప్రతాప్ ఆయా ప్రాంతాలకు వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ నేపథ్యంలో తిరుత్తణి మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రానగర్, నెహ్రూ నగర్, పెరియార్‌నగర్, అక్కయ్యనాయుడు వీధి తదితర ప్రాంతాల్లో సర్వే చేసిన కలెక్టర్ అర్హుల పేర్లు నమోదు చేసుకున్నారు. అనంతరం ఇందులో 1600 మందిని ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతాప్‌తో ఆర్డీవో దీప, ఎమ్మార్వో మలర్విళి, వార్డు కౌన్సిలర్ అశోక్‌కుమార్, ఆర్ గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండసముద్రంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియత్తం సమీపంలోని కొండసముద్రం ప్రాంతంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారికి విముక్తి కలిగిస్తున్న 'న్యూ లైఫ్ హౌస్ ట్రస్ట్' కేంద్రం ఆధ్వర్యంలో శక్తినగర్, పెరియార్‌నగర్ తదితర ప్రాంతాల ప్రజల కోసం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ట్రస్ట్ నిర్వాహకులు ఘనంగా ప్రారంభించారు. ట్రస్ట్ కోశాధికారి కరుణాకరన్ అధ్యక్షతన జరిగిన ఈ వైద్యశిబిరంలో సుమారు 300 మంది పరీక్ష చేయించుకున్నారని ఆయన తెలిపారు. అనంతరం ట్రస్ట్ సభ్యుల సమక్షంలో గ్రామస్థులకు డాక్టర్లు మందులు, కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ ఎన్.రమేష్ సహా ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లకు భూమిపూజ


పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చంద్రన్ తదితరులు

తిరుత్తణి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని గొల్లకుప్పం, ప్రాంద్రవేడు, కేశవకుప్పం, గ్రామాల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్మించనున్న ఉచిత గృహాలకు తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ మంగళవారం ఉదయం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా నేడు పేదలకు నిర్మించనున్న గృహాలకు భూమిపూజ చేసినట్టు తెలిపారు. అనంతరం 35 కుటుంబాలకు ఇళ్లపట్టాలను ఎమ్మెల్యే చంద్రన్ అందజేశారు. పళ్లిపట్టు నార్త్ డీఎంకే కార్యదర్శి, లాయర్ సీజే.శ్రీనివాసన్, పట్టణ కార్యదర్శి సెంథిల్‌కుమార్, దండపాణి, ముత్తురెడ్డి, మీసై వెంకటేశన్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంకే ఆధ్వర్యంలో చలివేంద్రం


ప్రజలకు మజ్జిగ అందజేస్తున్న డీఎంకే నేతలు

వేలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా డీఎంకే కార్యాలయం ఎదుట డీఎంకే జిల్లా కార్యదర్శి ఎంఎల్.నందకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నందకుమార్ మాట్లాడుతూ, ప్రజలకు నీరు, తాటిముంజలు, కొబ్బరిబొండాలు, ద్రాక్ష, బత్తాయి జ్యూస్, మజ్జిగ, రాగి అంబలి, పుచ్చకాయలు తదితరాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహ్మద్ అలీ సహా డీఎంకే కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పర్యవేక్షించండి

● కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేలూరు కాట్పాడి యూనియన్‌లో నిర్మించబోతున్న రోడ్లు, డ్రైనేజీ పనుల గురించి మంగళవారం అధికారులతో కలెక్టర్ సుబ్బులక్ష్మి సమావేశం నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరుగకుండా జిల్లా యంత్రాంగం పర్యవేక్షించాలని, ఏదైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టి తీసుకురావల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రూరల్ డెవెలెప్మెంట్ డైరెక్టర్ సెంథిల్‌కుమారన్, అభివృద్ధిశాఖ ఇంజనీర్లు, శ్రీనివాసన్, ఆనందకుమార్, కనకరాజ్ సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వళ్ళిమలై మురుగన్ ఆలయంలో విశేషపూజలు


దేవేరులతో దర్శనమిస్తున్న మురుగన్

వేలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోవున్న వళ్ళిమలై దేవస్థానంలో మంగళవారం పంగుని కృతిక సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వళ్లీదేవసేన సమేత మురుగన్ దర్శనానికి తెల్లవారుజాము నుండే పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి స్వామివార్లను దర్శనం చేసుకున్నారు. అనంతరం పండింతులు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ దేవేరుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

నీటమునిగి ఇద్దరు విద్యార్థినుల మృతి

పెరంబూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న ఇద్దరు విద్యార్థినులు నీటమునిగి మృతిచెందిన ఘటన తిరువణ్ణామలై జిల్లాలో చోటుచేసుకుంది. సదుప్పేరిపాళయానికి చెందిన మోనీషా (15), శివరంజిని (15) ప్రస్తుతం జరుగుతున్న పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారు. మంగళవారం ఉదయం ఇద్దరు సమీపంలోని వ్యవసాయ బావిలో స్నానం చేసేందుకు వెళ్లారు. ఊహించని విధంగా ఇద్దరు బావిలో మునిగారు. వారి కేకలు విని అక్కడకు చేరుకున్న చుట్టుపక్కల వారు బావిలో గాలించి వారి మృతదేహాలు వెలికితీశారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పాస్‌పోర్ట్ మోసం కేసులో నటి షర్మిలా థాపాపై కేసు

పెరంబూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్ట్ మోసానికి సంబంధించి నటి షర్మిలా థాపాపై చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ కేసు నమోదుచేసింది. 2011-21 వరకు షర్మిలా థాపా అన్నానగర్‌లోని తాను నివసిస్తున్న చిరునామాతో పాస్‌పోర్ట్ కలిగి ఉంది. పాస్‌పోర్ట్ గడువు ముగియడంతో మళ్లీ వ్యాసర్పాడి చిరునామాతో దరఖాస్తు చేసుకున్నారు. చిరునామా మార్పులో అవకతవకలు జరిగాయని విదేశీయుల జోనల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం తరఫున పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

వేలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియత్తంలో కల్తీ సారా విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ మథివానన్ నేతృత్వంలోని పోలీసు బృందం ఆంధ్రప్రదేశ్ చిత్తూరుకు చెందిన విజయ్‌కుమార్ (46), సుధాకర్ (26)లను అదుపులోకి తీసుకున్నారు. చిత్తూరు నుండి తీసుకొచ్చిన ఈ సారాను మొబైల్‌ఫోన్ ద్వారా కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. వీరిపై కేసునమోదు చేసి 3 లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేశారు.

విషవాయువు సోకి ఇద్దరి మృతి


మృతదేహాలు వెలికితీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెరంబూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా ఉడుమలైలోని కర్మాగారంలో విషవాయువు సోకి ఇద్దరు ఉత్తరాది కార్మికులు మృతిచెందారు. ఉడుమలై సడయాన్‌పాళయంలో బొప్పాయి పండ్ల ప్రాసెసింగ్ కర్మాగారం ఉంది. కర్మాగారంలో పండ్ల ప్రాసెసింగ్ తొట్టిలో మంగళవారం ఉదయం పనిచేస్తున్న ఒడిశాకు చెందిన రోహిత్ బికాల్ (25) హఠాత్తుగా విషవాయువు సోకి మృతిచెందాడు. అతడిని రక్షించేందుకు యత్నించిన అదే రాష్ట్రానికి చెందిన అరుణ్ గోమాంగో (25) కూడా విషవాయువు సోకి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని తొట్టి నుంచి ఇద్దరు మృతదేహాలు తరలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

టోల్‌గేట్ బాదుడుపై మధురవాయల్‌లో లారీ, బస్సు యజమానుల సంఘం ధర్నా

చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జాతీయ రహదారుల్లోని 40 టోల్‌గేట్లలో సోమవారం అర్ధరాత్రి నుండి రుసుము పెంపు అమలులోకి రావటంతో ప్రైవేటు లారీలు, ఆమ్నీ బస్సుల యజమానుల సంఘం మంగళవారం ఉదయం మధువాయల్ టోల్‌గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. నగరంలోని వానగరం, అంబత్తూరు సమీపం సూరపట్టు చెంగల్పట్టు సమీపం పరనూరు టోల్‌గేట్లలో వాహనాల నుండి వసూలు చేస్తున్న రుసుమును రూ.5 నుండి రూ.15ల వరకు పెంచడంతో నగరం నుంచి సేలం వెళ్లే వాహనాలు ఈ టోల్‌గేట్లలో రుసుము చెల్లించడం ద్వారా అదనంగా రూ.200ల దాకా నష్టపోయే అవకాశం ఉందని లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు యువరాజ్ తెలిపారు. యేడాదికి రెండుసార్లు ఇలా టోల్‌గేట్ రుసుములను పెంచడం మంచి పద్ధతి కాదని ఆయన పేర్కొన్నారు.

రాజకీయాలు తెలియవు: నటుడు ఆర్కే



మీడియా సమావేశంలో రాధాకృష్ణన్ (ఆర్కే)

తనకు రాజకీయాలు తెలియవని అందుకే వాటిలోకి ప్రవేశించనని ప్రముఖ నటుడు, ఆర్కే. సినీ స్టూడియో అధినేత, వీవీపీ హెయిర్ కలర్ కంపెనీ వ్యవస్థాపకుడు 'టాన్ శ్రీ దాతో శ్రీ' డాక్టర్ రాధాకృష్ణన్ అలియాస్ ఆర్కే స్పష్టం చేశారు. ఆయన మంగళవారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ, 'నా వంతుగా చిత్రపరిశ్రమకు సాయం చేస్తున్నాను. గత రెండేళ్ళుగా సినిమాలు తీయకపోవడానికి కారణం ఆర్కే. స్టూడియో పేరుతో సినిమా స్టూడియో నిర్మించాను. చాలామంది సినిమాల్లో సంపాదించి ఇతర రంగాల్లో పెట్టుబడి పెడుతుంటారు. కానీ, నేను మాత్రం వ్యాపార రంగంలో సంపాదించి ఈ స్టూడియో నిర్మించాను. చిత్రపరిశ్రమకు నేను చేసిన చిన్నసాయం ఇది. ఇపుడు ఒక చిత్రాన్ని నిర్మించాను. యోగిబాబు, తంబిరామయ్య, నాజర్ వంటి పెద్దపెద్ద ఆర్టిస్టులు నటించారు. హీరోగా నేను నటించాను. చిత్ర నిర్మాణం దాదాపు పూర్తయింది. త్వరలో విడుదల చేస్తాం. అగ్రహీరో విజయ్ రాజకీయ రంగ ప్రవేశంపై స్పందిచేందుకు నా దగ్గర ఏమీ లేదన్నారు. నా వరకు నేను రాజకీయాల్లోకి అడుగుపెట్టను. ప్రజాసేవ చేయడానికి రాజకీయాల్లోకి రావాలనే నిర్బంధం లేదన్నారు. వ్యాపార రంగంలో ఉంటూ కూడా సేవ చేయొచ్చు. మా వీవీపీ హెయిర్ కలర్ కంపెనీ ద్వారా దేశ వ్యాప్తంగా రెండు వేల వందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నాం. ఇంత కంటే ప్రజాసేవ ఏముంటుంది. మన దేశంలోని నూతన ఆవిష్కరణలకు విదేశాల్లో విలువ లేదు. అరుదైన వనమూలికలతో తయారు చేసిన మా కంపెనీ హెయిర్‌కలర్ విక్రయాలకు అమెరికా వంటి దేశాల్లో అనుమతి నిరాకరించారు. ఆ తర్వాత లండన్ వేదికగా క్లినికల్‌గా నిరూపించి అనుమతులు పొందాం. బెస్ట్ మోటివేషనల్ స్పీకర్‌గా 18 దేశాలు గుర్తించి గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేశాయి. 'సేవా దృక్పథం - నూతన ఆవిష్కరణలు' అనే అంశానికి గాను ఫిలిప్పీన్స్ దేశంలోని ఓ రాజు 'టాన్ శ్రీ దాతో శ్రీ' బిరుదుతో పాటు రాజవంశీయులు ఉపయోగించిన రెండు ఖడ్గాలను బహుమతిగా ఇచ్చారు. 140 కోట్ల మంది జనాభా ఉన్న భారత్‌లో శామ్‌సంగ్, ఐఫోన్ వంటి నాణ్యవంతమైన మొబైల్స్ ఫోన్లు తయారు చేయలేమా? అని ఆర్కే ప్రశ్నించారు.

తమిళ చిత్రజ్యోతి

స్నేహితులకు పార్టీ ఇచ్చిన సూర్య దంపతులు



హీరో సూర్య, ఆయన సతీమణి జ్యోతిక కలిసి తమ నివాసంలో చిత్రపరిశ్రమలోని తన స్నేహితులైన హీరోయిన్లు, స్నేహితురాళ్ళకు గ్రాండ్ పార్టీ ఇచ్చారు. దీనికి సంబంధించిన ఫొటోలు ఇపుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. 1997లో ఓ హిందీ చిత్రం ద్వారా చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన జ్యోతిక... 1999లో అజిత్ నటించిన 'వాలి' చిత్రం ద్వారా తమిళ వెండితెరకు పరిచయమై, అగ్రనటిగా ఎదిగారు. 2006లో హీరో సూర్యను ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. '36 వయదినిలే' అనే చిత్రంతో రీఎంట్రీ ఇచ్చిన జ్యోతిక... మహిళా నేపథ్యం ఉన్న కథలు, పాత్రలను ఎంచుకుంటూ నటిస్తున్నారు. ఇపుడు బాలీవుడ్‌పై కూడా దృష్టిసారించారు. తమకు వివాహమై 20 యేళ్ళు పూర్తికానున్న నేపథ్యంలో తమ నివాసంలో గ్రాండ్ పార్టీ ఏర్పాటుచేశారు. ఇందులో త్రిష, రమ్యకృష్ణ, రాధిక, వీజే రియా, బృంద ఇలా అనేక మంది పాల్గొన్నారు. వీరందరితో కలిసి సూర్య దంపతులు ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. ఈ ఫొటోలను షేర్ చేసిన సూర్య దంపతులు 'ఈ రోజు మరిచిపోలేని రోజు' ట్వీట్ చేశారు.

పెళ్ళికి సిద్ధమవుతున్న త్రిష?



స్టార్ హీరోయిన్ త్రిష పెళ్ళికి సిద్ధమవుతున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ తరహా పుకార్లకు ఆమె తన ఇన్‌స్టాఖాతాలో పోస్ట్ చేసిన ఓఫొటో కారణమైంది. ఈ అమ్మడి పెళ్ళి గురించి చిత్రపరిశ్రమలో అనేక రకాలైన పుకార్లు వస్తున్నాయి. కానీ, వాటిపై ఏనాడు స్పందించలేదు. ఈ నేపథ్యంలో తాజాగా తన ఇన్‌స్టా ఖాతాలో ఆమె పెట్టిన పోస్ట్ ఇపుడు పెళ్ళిపై చర్చకు దారితీసింది. సంప్రదాయ వస్త్రాలు ధరించి పెళ్ళి కూతురిలా ముస్తాబైవున్న ఓ ఫొటోను త్రిష తన ఇన్‌స్టాఖాతాలో షేర్ చేశారు. ఆకుపచ్చ రంగు చీరలో ఒంటి నిండుగా బంగారు ఆభరణాలతో, చేతికి ఉంగరం ధరించి ఉన్న త్రిష ఫొటో ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించింది. దీనికి 'ప్రేమ ఎల్లపుడూ గెలుస్తుంది' అనే క్యాప్షన్ జతచేసింది. దీంతో త్రిష ప్రేమలో పడిందనే ప్రచారం జోరుగా సాగుతోంది. మనసిచ్చినవాడిని మనువాడడానికి సిద్ధమవుతోందంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. కాగా, ఐదేళ్ళ క్రితమే కెరీర్ పరంగా త్రిష పనైపోయిందనే ప్రచారం సాగింది. కానీ, మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్' చిత్రం తర్వాత ఆమె కెరీర్ తారస్థాయికి చేరుకుంది. ఇటు కోలీవుడ్, అటు టాలీవుడ్ భాషల్లో అగ్రహీరోల చిత్రాల్లో సోలో హీరోయిన్‌గా నటిస్తూ బిజీ హీరోయిన్‌గా మారింది.

యువన్ శంకర్ రాజాకు షాకిచ్చిన 'సర్దార్' టీం



ప్రముఖ సంగీత దర్శకుడు యువన్ శంకర్ రాజాకు 'సర్దార్' చిత్ర బృందం గట్టి షాకిచ్చింది. ఈ ప్రాజెక్టు నుంచి ఆయనను తప్పించి, ఆయన స్థానంలో మరో సంగీత దర్శకుడు శ్యామ్ సీఎస్‌ను తీసుకున్నారు. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో హీరో కార్తి, నటుడు ఎస్‌జే సూర్య కలిసి నటిస్తున్న తాజా చిత్రం 'సర్దార్-2' ప్రాజెక్టు సెట్స్‌పైకి తీసుకెళ్ళినప్పటి నుంచి సంగీత దర్శకుడిగా యువన్ శంకర్ రాజాను ఎంపిక చేశారు. అయితే, ఇపుడు ఆయన స్థానంలో శ్యామ్ సీఎస్‌ను తీసుకున్నారు. నిజానికి ఈ మార్పు ఎపుడో జరిగిపోయిందంటూ ప్రచారం సాగింది. కానీ, చిత్ర బృందం ఎక్కడా అధికారికంగా ధ్రువీకరించలేదు. ఈ నేపథ్యంలో సోమవారం ఈ మూవీలోని విలన్ పాత్రధారిని పరిచయం చేస్తూ రిలీజ్ చేసిన ప్రత్యేక ట్రైలర్‌లో సంగీత దర్శకుడుగా శ్యామ్ సీఎస్ పేరు ఉంది. దీంతో యువన్ శంకర్ రాజాను తప్పించారనే విషయం తేటతెల్లమైపోయింది. చివరి నిమిషంలో ఈ మార్పునకు గల కారణం ఏంటో తెలియదు. కాగా, 'సర్దార్' తొలి భాగానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీత స్వరాలు సమకూర్చిన విషయం తెల్సిందే.

ఉత్తిరకోశమంగై ఆలయంలో

4న మహా కుంభాభిషేకం

● మరకత నటరాజస్వామి నిజరూపదర్శనం ప్రారంభం



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా ఉత్తిరకోశమంగైలోని సుప్రసిద్ధ మంగళేశ్వరి సమేత మంగళనాథర్ ఆలయంలో 15 యేళ్ల తర్వాత ఈ నెల 4న మహాకుంభాభిషేక వేడుకలు జరుగనున్నాయి. సంస్థాన దేవస్థానం, రాష్ట్ర ప్రభుత్వం, ఉభయదారులు సమకూర్చిన కోట్లాది రూపాయలతో చేపట్టిన ఆలయ జీర్ణోద్ధరణ పనులు ఇటీవలే పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో మహా కుంభాభిషేక వేడుకలకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం ఆలయంలోని అపూర్వ మరకత నటరాజస్వామివారి సన్నిధి తెరచి, స్వామివారిపై ఉన్న చందన తాపడాన్ని తొలగించి భక్తులకు నిజరూపదర్శనం కల్పిస్తున్నారు. ఈ విషయమైన దివాన్ పళనివేల్ పాండ్యన్ మీడియాతో మాట్లాడుతూ కుంభాభిషేకం దృష్ట్యా మరకత నటరాజస్వామివారి సన్నిధిని తెరచినట్లు తెలిపారు. ఆ స్వామివారిపై ఉన్న చందనతాపడాన్ని తొలగించి ఈ నెల 4 వరకు మరకత నటరాజస్వామివారి నిజరూపాన్ని దర్శించేందుకు భక్తులను అనుమతించనున్నట్లు చెప్పారు. ఈ నెల నాలుగు సాయంత్రం మళ్ళీ మరకత నటరాజస్వామివారికి చందన తాపడం చేసి సన్నిధి మూసివేస్తామన్నారు. కుంభాభిషేకం జరిగే రోజున పైభాగంలో దళంపై 1500 మంది భక్తులను మాత్రమే దర్శనానికి అనుమతిస్తామని చెప్పారు. కుంభాభిషేకం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా కుంభాభిషేక ముందస్తు పూజా కార్యక్రమాల్లో భాగంగా యాగశాలలో మంగళవారం ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యావహచనం, మహాగణపతి హోమం, నవగ్రహహోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆలయంలో యేడాదికొకమారు ఆరుద్రదర్శనం రోజున మాత్రమే మరకత నటరాజస్వామివారి సన్నిధిని తెరచి స్వామివారి దర్శనానికి భక్తులను అనుమస్తారు. ప్రస్తుతం మహాకుంభాభిషేకాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం నుండి ఈ నెల నాలుగోతేదీ సాయంత్రం వరకు మరకత నటరాజస్వామివా నిజరూపదర్శనం కల్పిస్తున్నారు. ఈ నాలుగు రోజులపాటు మరకత నటరాజస్వామివారి దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు.

రేపు కపాలీశ్వరాలయంలో

పంగుణి ఉత్సవాలు ప్రారంభం



ప్యారీస్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లో ప్రసిద్ధిచెందిన కపాలీశ్వయాలయంలో పంగుణి ఉత్సవాలు గురువారం ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. 9వ తేది రథోత్సవం, 10న ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని శివాలయాల్లో పురాతనమైనదిగా పేరొందిన మైలాపూర్ కపాలీశ్వరాలయంలో ప్రతి ఏటా పది రోజులు పంగుణి ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.. ధ్వజారోహణంతో ఈ ఏడాది ఉత్సవాలు 3వ తేది ప్రారంభం కానున్న నేపథ్యంలో, మంగళవారం ఉదయం గ్రామ దేవత పూజలు నిర్వహించారు. ఉత్సవ రోజుల్లో ఉదయం, సాయంత్రం వెండి వాహన సేవ, రాత్రి 10 గంటలకు నెమలి వాహనం, పొన్న వృక్ష వాహనం, కల్పవృక్ష వాహన సేవలు జరుగనున్నాయి. 5వ తేది స్వామివారు అధికార నంది వాహనంపై మాడవీధుల్లో విహరించనున్నారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన 63 మంది నాయన్మార్ల ఊరేగింపు ఈ నెల 10న, 12వ తేది తిరుకల్యాణోత్సవం జరుగనుంది. 13న ఉమామహేశ్వరుడి దర్శనం, 14వ తేది పతాక అవనతంతో ఈ వేడుకలు పూర్తవుతాయి. ఇక, విడయాత్రి ఉత్సవం 14 నుంచి 23వ తేది వరకు కొనసాగనుంది. 10 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు కనీస వసతులు కల్పించారు. మరోవైపు పోలీసులు కూడా బందోబస్తు ఏర్పాట్లు పూర్తిచేశారు.

కుంభకోణం తమలపాకు, తోవాలై పూసలమాలకు

భౌగోళిక గుర్తింపు



భౌగోళిక గుర్తింపు పొందిన కుంభకోణం తమలపాకు, తోవాలై పూసలమాల

ప్యారీస్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి తోవాలైలో లభ్యమైయ్యే అరుదైన మణిపూసలతో తయారుచేసే మాల, తంజావూర్ జిల్లా కుంభకోణం కొళందు వెత్రిలైగా పిలిచే తమలపాకుకు భౌగోళిక గుర్తింపు వచ్చిందని సీనియర్ న్యాయవాది సంజయ్ గాంధీ పేర్కొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఉత్పత్తి అవుతూ, ప్రత్యేక గుర్తింపు పొందిన వస్తువులకు భౌగోళిక గుర్తింపు ఇస్తుంటారు. ఆ రీతిలో రాష్ట్రంలో దిండుగల్ తాళం బుర్ర, సేలం సుంగుడి చీర, కాంచీపురం పట్టు, మదురై మల్లి, తంజావూరు కళాత్మక పల్లెం, శ్రీవిల్లిపుత్తూరు పాలకోవా, కోవిల్‌పట్టి వేరుశనగ మిఠాయి, పళని పంచామృతం, కొడైకెనాల్ పర్వతాలపై పండించే వెల్లుల్లి, విలాచ్చేరి మట్టిబొమ్మ తదితర రకరకాల ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులు భౌగోళిక గుర్తింపు పొందాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కుంభకోణం తమలపాకు, తోవాలై పూసలమాలకు భౌగోళిక గుర్తింపు వచ్చిందని న్యాయవాది సంజయ్ గాంధీ మంగళవారం మీడియాతో పేర్కొన్నారు. వ్యవసాయానికి సంబంధించిన కుంభకోణం తమలపాకుకు మొట్టమొదటి సారిగా ఈ గుర్తింపు వచ్చిందని ఆయన తెలిపారు. అంతేకాకుండా వందవాసి చేప, జవ్వాదు చింత పండు, కొల్లిమలై మిరియాలకు కూడా భౌగోళిక గుర్తింపు వచ్చేలా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.



చెన్నై సచివాలయంలో శాసనసభలో ప్రజాపనులు, రహదారుల శాఖ ఆర్థిక పద్దులను సమర్పించడానికి ముందు ఆ శాఖ మంత్రి ఈవీ వేలు, ఆ శాఖ అధికారులను అభినందిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

కోయంబేడులో

'బ్యూటిఫుల్ గ్రీన్ పార్క్'



గ్రీన్ పార్క్ నమూనా

పెరంబూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు ఇన్నర్ రింగ్ రోడ్డు, పూందమల్లి హైరోర్డు జంక్షన్‌లో 3.59 ఎకరాల్లో రూ.8.63 కోట్లతో పచ్చటి పార్క్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ఈ పార్క్ చుట్టపక్కల పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛమైన గాలి అందించేలా మొక్కలు, చెట్లు ఏర్పాటు చేస్తున్నారు. 50 మంది కూర్చొనేలా హాలు, చిన్న కొలను, యోగా కేంద్రం, స్కేటింగ్ ఏరియా, జిమ్, పిల్లల క్రీడా పార్క్, వాకింగ్ ట్రాక్, టాయిలెట్, పార్కింగ్ తదితర వసతులు కల్పిస్తున్నారు. సీఎండీఏ చొరవతో కోయంబేడు పై ఓవర్ కింది ప్రాంతం ప్రస్తుతం ఆహ్లాదకరంగా మారింది. సాయంత్రం వేళ స్వచ్ఛమైన గాలిలో నడిచేందుకు ప్రజలు పార్క్‌కు రావడం ప్రారంభించారు. నగరానికి మరింత అందం సమకూర్చనున్న ఈ పార్క్ మే మొదటి వారంలో ప్రజల సందర్శనకు అనుమతించే అవకాశముందని అధికారులు తెలిపారు.



సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేస్తున్న జీఎం సుబ్బారావు తదితరులు

రైలు బోగీల ఉత్పత్తిలో

ఐసీఎఫ్ సరికొత్త రికార్డు

అడయార్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరులోని రైలు పెట్టెల తయారీ కర్మాగారం (ఐసీఎఫ్) 2024-25 సంవత్సరంలో సరికొత్త రికార్డు నెలకొల్పింది. 2024-25లో ఐసీఎఫ్ మొత్తం 3,007 రైలు బోగీల(కోచ్)ను తయారు చేసింది. క్రితం యేడాది అంటే 2023-24లో 2,829 బోగీలు చేసింది.. ఈ యేడాది ఉత్పత్తి చేసిన 3,007 కోచ్‌ల్లో 1,169 డిస్ట్రిబ్యూటెడ్ పవర్ రోలింగ్ స్టాక్ (డీపీఆర్ఎస్) కోచ్‌లను వందే భారత్ స్లీపర్, వందే భారత్ చైర్ కార్, ఈఎంయూ, మెము రైళ్ళ కోసం తయారు చేశారు. మిగిలిన 1,838 కోచ్‌లు లికే హాఫ్‌మ్యాన్ బుష్ (ఎల్‌బీహెచ్) రకం కోచ్‌లు. గత సంవత్సరంలో ఈ కర్మాగారం పలు మైలురాళ్ళను నమోదు చేసింది. వీటిలో ట్రెజరరీ వ్యాన్ కోచ్‌లను పరిచయం చేయడం, తొలి వందే భారత్ రైలు కోసం 16 కోచ్‌ల తయారీ, 12 కోచ్‌లతో నమో భారత్ ర్యాపిడో రైల్, 21 ర్యాక్‌లతో వందే భారత్ రైలు తయారీ వంటి మైలురాళ్ళను నమోదు చేసినట్టు ఐసీఎఫ్ విడుదల చేసిన ప్రటకనలో పేర్కొంది. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ యు.సుబ్బారావు విధుల్లో సిబ్బంది కనబరిచిన అంకిభావం, శ్రద్ధను కొనియాడుతూ స్వీట్లు పంచిపెట్టారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కృతిగై వేడుకలు



తిరుత్తణి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయంలో పంగుని కృతిగై వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృత్తిక నక్షత్రం రోజున వేలాది సంఖ్యలో భక్తులు కావళ్లతో వచ్చి తల నీలాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



టోల్ ప్లాజాలో రేట్లు పెంపు





వేలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా టోల్‌ప్లాజాల్లో టోల్ రేట్లను పెంచుతున్నట్లు గత గత ఏడాది సెప్టెంబరులో నేషనల్ హైవేస్ అథారిటీ ప్రకటించింది. ఇందులో భాగంగా ఏప్రిల్ 1 నుంచి వేలూరుజిల్లా కెనియంబాడి ప్రాంతంలోని టోల్ ప్లాజాలో కొత్తధరల వివరాలతో బోర్డు ఏర్పాటు చేసింది. ఈ ధరలు రాష్ట్రంలోని 40 టోల్‌గేట్లకు ఏప్రిల్ 1వ తేదీ అర్ధరాత్రి 12గంటల నుండి అమల్లోకి రానున్నట్లు వెల్లడించింది. కమర్షియల్ వాహనాలు, బస్సులు, ట్రక్కులకు ఈ కొత్త ధరలు వర్తించనున్నాయి. కాగా, కారు, జీపు, వ్యాన్ తదితర చిన్న వాహనాలకు మాత్రం పాత రేట్లే కొనసాగించడం గమనార్హం.

మహాకాళియమ్మ ఆలయంలో

నేత్రపర్వంగా నాట్యోత్సవం



మహాకాళి వేషధారణలో భక్తుడి నాట్యం

ప్యారీస్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా పాపనాశం వంగారంపేటలో శక్తిస్వరూపిణి వీర మహాకాళియమ్మ ఆలయ 56వ వార్షిక నాట్యోత్సవం మంగళవారం నేత్రపర్వంగా సాగింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఈ ఆలయంలో ఉదయం గణపతి హోమం, అగ్ని హోమం అనంతరం పొలిమేర దేవతలను ఆహ్వానిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాలనుండి వివిధ కావళ్లు, గరగం, పాల కలశాలతో పాదయాత్రగా వెళ్లిన భక్తులు నాట్యోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోవున్న మైదానంలో పలువురు భక్తులు మహాకాళి, దుర్గాదేవి, మహాశక్తి, మారియమ్మ వేషధారణలో పురవీధుల్లో నాట్యమాడుతూ తమ భక్తిని చాటుకున్నారు.




చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



మొదటిఘాట్‌లో అదుపుతప్పిన టీటీడీ టెంపో

● ఏడుగురికి గాయాలు

తిరుమల, మార్చి1(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో మంగళవారం టీటీడీకి చెందిన టెంపో వాహనం అదుపుతప్పి పిట్టగోడను ఢీకొంది. దీంతో ఐదుగురికి గాయాలయ్యాయి. తిరుమలలో అనధికారికంగా ఉంటున్న వ్యక్తులను వారం రోజులుగా విజిలెన్స్, పోలీసులు గుర్తించి తిరుపతికి తరలిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలోనే మంగళవారం కూడా 22 మందిని గుర్తించారు. వీరిని డైండోవర్ చేసేందుకు టెంపో వాహనంలో తిరుమల నుంచి తిరుపతికి తరలిస్తుండగా మార్గంలోని చివరి మలుపు వద్ద వాహనం అదుపుతప్పింది. పిట్టగోడను ఢీకొంది. ఈప్రమాదంలో ఐదుగురు భక్తులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను రుయా ఆస్పత్రికి తరలించి వైద్యం చేశారు. వాహనంలో 14 మంది మాత్రమే ఉన్నారని, మిగిలిన వారు ఆర్టీసీ బస్సులో వెళ్లారని పోలీసులు చెబుతున్నా నిబంధనలకు విరుద్ధంగా 22 మందిని ఎక్కించినట్టు తెలుస్తోంది.


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.04 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,007


తలనీలాలు సమర్పించినవారు: 27,440



ఇంటర్‌లో సంస్కరణలకు నాంది

విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ ఓ కీలకమలుపు. మ్యాథమేటిక్స్ కోర్సులవైపు వెళ్లాలా... లేక సైన్స్ కోర్సుల్లో చేరాలా అనే విషయాన్ని నిర్ధారించుకునే తరుణమిదే. ఈ దశలో ఎంపిక చేసుకున్న గ్రూప్ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. ఆసక్తి ఉన్న అంశాన్నే ఎంపిక చేసుకోవాలని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. మ్యాథ్స్ కోర్సులకు ఎంపీసీ, సైన్స్ కోర్సులకు బైపీసీ తీసుకుంటారు. ఈ రెండూ చదవాలనుకుంటే ఇప్పటివరకూ కుదరని పరిస్థితి. కానీ తాజాగా రెండు గ్రూపులూ చదివేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అంతేకాదు ముఖ్యమైన ఇంటర్మీడియట్ విషయంలో కొన్ని మేలైన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



కొత్తగా ఎంబైపీసీ

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎంబైపీసీ గ్రూపు అందుబాటులోకి రానుంది. ఆరు సబ్జెక్టులతో ఎంబైపీసీ చదవచ్చు. లాంగ్వేజి సబ్జెక్ట్ ఇంగ్లిష్ తప్పనిసరి. తరవాత సెంకడ్ లాగ్వేజీ ఆప్షనల్‌గా ఎంచుకోవచ్చు. ఇవికాకుండా గణితం, బయాలజీ, ఫిజిక్స్, కెమెస్ట్రీ సబ్జెక్టులు ఈ గ్రూప్‌లో ఉంటాయి. ఎంపీసీ విద్యార్థులు సెకండ్ లాంగ్వేజ్‌గా హిందీ, సంస్కృతం, ఉర్దూ కాకుండా బయాలజీ తీసుకుని ఎంబైపీసీ చదవవచ్చు. బైపీసీ విద్యార్థులు గణితాన్ని తీసుకుని ఎంబైపీసీ గ్రూపు చదవవచ్చు. ఎంబైపీసీ తీసుకున్న విద్యార్థులకు అవకాశాలు విస్తృతమతుతాయి. వీరు ఇటు మెడిసిన్, అటు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షలు రాసే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో ఎంబైపీసీ గ్రూపునకు మంచి స్పందన లభించనుంది.

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు: 21

ప్రయివేట్ జూనియర్ కాలేజీలు: 132

ఇతర యాజమాన్య కళాశాలలు: 7

ప్రథమ సంవత్సర విద్యార్థులు: 32,689

ఈఏడాది నుంచి కొత్తగా ఎంబైపీసీ గ్రూప్

మెడిసిన్, ఇంజనీరింగ్‌ల్లో చేరికకు అవకాశం

గణితం, బోటనీ, జువాలజీ కలిపి బయాలజీ

ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌కు శ్రీకారం

ఇప్పటివరకూ ఇంటర్మీడియట్‌లో ఆరు సబ్జెక్టుల విధానం ఉంది. సైన్స్ గ్రూపుల్లో రెండు బాషా సబ్జెక్టులు, నాలుగు కోర్ సబ్జెక్టులు, ఆర్ట్సులో రెండు బాష, మూడు కోర్ సబ్జెక్టులు ఉన్నాయి. ఇకపై ఐదు సబ్జెక్టుల విధానం అమల్లోకి రానుంది. ప్రస్తుతం ఎంపీసీలో గణితం ఏ, బీ పేపర్లుగా ఉంది. దీనిని ఒకే సబ్జెక్ట్‌గా మార్చింది. బైపీసీలో బోటనీ, జువాలజీ సబ్జెక్టులను కలిపి బయాలజీగా చేసింది. దీనివల్ల సైన్స్ గ్రూపుల్లో కోర్ సబ్జెక్టులు ఐదు నుంచి నాలుగుకు తగ్గాయి. ఎంపీసీలో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ తప్పనిసరిగా ఉంటాయి. మరో సబ్జెక్ట్‌గా తెలుగు, సంస్కృతాన్ని ఐచ్ఛికంగా తీసుకోవచ్చు. బైపీసీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్‌తోపాటు ఒక ఎంపిక సబ్జెక్ట్ ఉంటుంది. ఆర్ట్స్ గ్రూప్‌లో కూడా గణితం, బయాలజీలను ఆప్షనల్‌గా తీసుకోవచ్చు. 6వ సబ్జెక్టును ఆప్షనల్‌గా ఎంచుకునే అవకాశం లేదు. రెండో స్థానంలోని లాంగ్వేజ్ సబ్జెక్టును మాత్రమే ఎంచుకునే అవకాశం ఉంటుంది.

ఎన్‌సీఈఆర్టీ సిలబస్

ఇంటర్‌లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను ప్రవేశ పెట్టనున్నారు. ఈ ఏడాది పదవ తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్టీ సిలబస్ బోధించినందున ఇంటర్ మొదటి సంవత్సరంలోనూ ఈ సిలబస్‌ను ప్రారంభించనున్నారు. రెండో సంవత్సర విద్యార్థులకు పాత విధానమే కొనసాగనుంది. పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాలు, తరగతుల నిర్వహణ విధానాలను సీబీఎస్ఈ విధానంలోకి మార్చారు. ఆమేరకు ఏప్రిల్ 1 నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం కానున్నాయి. 7వ తేదీ వరకు కొత్త సిలబస్‌పై ఓరియంటేషన్ తరగతులు జరుగనున్నాయి. 7 నుంచి ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. 24 నుంచి జూన్ 1 వరకు వేసవి సెలవులిస్తారు. జూన్ 2వ తేదీన కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. సీబీఎస్ఈ సిలబస్ పుస్తకాలతోపాటు నోట్‌పుస్తకాలు, రికార్డు షీట్లను ప్రభుత్వమే ఉచితంగా విద్యార్థులకు అందించనుంది.





రేపటి మన సమాజ భవిష్యత్తు అయిన చిన్నారుల్లో పుస్తకాభిలాష తగ్గుతూ ఉంది. పిల్లల్లో పుస్తక పఠనాసక్తి పెంచితే సామాజిక బాధ్యత, నైతిక విలువలు అలవడతాయంటున్నారు వ్యక్తిత్వ వికాస నిపుణులు, ఉపాధ్యాయులు, సాహిత్యవేత్తలు. నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా కథనం.

పుస్తకం చదివితే ప్రపంచ విజ్ఞానం

● నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోను, కంప్యూటర్ ద్వారా నిత్యం యూట్యూబ్, వాట్సప్, ఫేస్‌బుక్‌లో గడిపే ఈ తరానికి పుస్తక పఠనాసక్తి తగ్గింది. దీనివల్ల చిన్నారులకు నిజమైన ప్రాపంచిక జ్ఞానం అందడం లేదు. దీంతో సామాజిక బాధ్యత, నైతిక విలువలు పెంపొందడం లేదు. ఒకనాడు ఊరిలో, ఇంట్లో పుస్తకాలు, కళల ద్వారా విజ్ఞానం అందేది. గుడిలో భజన, కోలాటం, చెక్క భజన, మహాభారతం వంటి కళా రూపాల ద్వారా ఎన్నో విలువలు అందేవి. పత్రికల ద్వారా.. బొమ్మల ద్వారా.. చిన్నారులకు విలువలు తెలియచేసే అవకాశం ఉండేది. ఇక, వేమన పద్యాలు, సుమతీ శతకం, బేతాళ కథలు వంటి పుస్తకాలు గొప్ప విజ్ఞానాన్ని అందించేవి. క్రమేణా చిన్నారుల్లో పుస్తకాల పట్ల అభిలాష తగ్గుతూ ఉంది. ఇందువల్ల చిన్నారుల్లో ఆత్మనూన్యత, మానసికంగా కుంగిపోవడం, అభద్రతా భావం, మానసిక వ్యథ పెరుగుతోంది. ఇటువంటి భావ దారిద్ర్యానికి మూల కారణం పుస్తక పఠనం లేకపోవడమేనని వ్యక్తిత్వ వికాస నిపుణులు, సాహిత్యవేత్తలు అంటున్నారు. చిన్నారుల్లో పుస్తక పఠనం పట్ల అభిలాష పెంచాలని కోరుతున్నారు. తద్వారా నైతిక విలువలు, సామాజిక బాధ్యత అలవడతాయని అంటున్నారు. ఈ దిశగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచిస్తున్నారు.

పుస్తకాలు చదవడంతోనే వ్యక్తిత్వ వికాసం



మంచి పౌరులుగా పిల్లలు ఎదగాలంటే పుస్తకాలు తప్పక చదవాలి. దీనికి తోడు సంగీతం, సాహిత్యం కూడా తెలుసుకోవాలి. మంచి పుస్తకాలే గొప్ప నేస్తాలు. మంచి పుస్తకాలను పిల్లలతో చదివించే వారు గొప్ప తల్లిదండ్రులు. పిల్లలను పుస్తకాల దగ్గరకు తీసుకెళ్లే వారు ఇంకా గొప్ప తల్లిదండ్రులు, గురువులు. పిల్లలు మంచి పుస్తకాలు చదవడం ద్వారా వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది.

- కోట పురుషోత్తం, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు

పుస్తక పఠనంతో సృజనాత్మకత



పుస్తకం చదివితే వ్యక్తిత్వ వికాసం పెరుగుతుంది. సృజనాత్మకత ఏర్పడుతుంది. ఇందువల్ల తొలి మొగ్గలు (కవిత్వం), పసిడి మొగ్గలు (కథలు), బాల కథా నిధి, కర దీపిక (మహనీయుల గాథలు) వంటి పుస్తకాలు తెచ్చాం. ఇలా రాబోయే తరానికి విలువలు అందించాలని ప్రయత్నిస్తున్నా. పాఠశాల స్థాయిలో పుస్తకం.. పద్యం.. కవితా పఠనంచేస్తే ఫలితాలు సాధించవచ్చు.

- డాక్టర్ నెమిలేటి కిట్టన్న, తెలుగు ఉపాధ్యాయుడు, మంగళం ట్రెండ్స్ స్కూల్

ఎర్రచందనం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

● రూ.మూడు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.మూడు లక్షలు జరిమానా విధిస్తూ ఎర్రచందనం ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. అటవీశాఖ లైజన్ అధికారి చంద్రశేఖర రాజు తెలిపిన ప్రకారం.. చిత్తూరుకు చెందిన సత్యమోహన్, మరికొందరు కలిసి కొన్నేళ్లుగా శేషాచలం అడవుల్లో నుంచి ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నారు. 2019లో రాయచోటి అటవీ శాఖ రేంజ్ పరిధిలోని సరస్వతి పల్లి బీట్‌లో 39 కిలోల ఎర్రచందనం దుంగలు తమిళనాడుకు తరలించడానికి సిద్ధం చేశారు. ఈ విషయం తెలిసి అప్పటి అటవీశాఖ బీట్ అధికారి భరణికుమార్, సెక్షన్ అధికారి శ్రీరాములు అక్కడికి వెళ్లి వాహనం సహా దుంగలు పట్టుకున్నారు. నిందితుల్లో ఒకడైన సత్యమోహన్‌ను అరెస్టు చేయడానికి సిద్ధపడగా, అధికారుల ఎదుటే అతడు బ్లేడుతో ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో ఎర్రచందనం అక్రమ రవాణాతో పాటు ఆత్మహత్యాయత్నంపైనా కేసు నమోదు చేశారు. ఈ కేసును తిరుపతి ఎర్రచందనం కోర్టులో దాఖలు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణమ నాయుడు ప్రభుత్వం తరపున వాదించారు. నిందితుడికి శిక్ష పడేలా అటవీ శాఖ బీట్ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, లైజన్ అధికారి చంద్రశేఖర రాజు,కోర్టు కానిస్టేబుల్ కొండయ్య తగిన సాక్ష్యాధారాలను తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఇరు వర్గాల వాదనలు విన్నాక నిందితుడు సత్యమోహన్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ మూడు లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నరసంహమూర్తి తీర్పు చెప్పారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే ఎవరినీ వదిలిపెట్టేది లేదని, శిక్షలు కఠినంగా ఉంటాయని బీట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. త్వరలో డ్రోన్లతోనూ నిఘా పెడతామన్నారు.




గ్రామస్థులు విచారిస్తున్న పోలీసులు, గాయపడ్డ భూపతిరెడ్డి

కత్తులతో దాడి: ఒకరికి తీవ్రగాయాలు

రామచంద్రాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కత్తులతో దాడి చేసిన ఘటనలో ఒకరు గాయపడిన సంఘటన రామచంద్రాపురం మండలం అనుపల్లి పంచాయతీ రేకలచేనులో ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని వినాయకస్వామి ఆలయం వద్ద గత శనివారం రాత్రి 11 గంటల వరకు కొందరు భజన చేశారు. గ్రామానికి చెందిన లీలాప్రకాష్‌రెడ్డి వచ్చి తన నాలుగు నెలల పాప నిద్రపోవడం లేదంటూ మైక్ ఆపాలని కోరారు. దీంతో కొంతసేపు ఆపి మళ్లీ మైక్ సౌండ్ బిగ్గరగా పెట్టి భజన చేశారు. దీంతో భజన చేసేవారితో లీలాప్రకాష్‌రెడ్డి వాగ్వాదానికి దిగారు. మైక్ తీసుకెళ్లారు. ఈ ఘటనను భూపతిరెడ్డి వీడియో తీసి తన మిత్రుడు రాజశేఖర్‌రెడ్డికి పంపారు. లీలాప్రకాష్‌రెడ్డి హిందువులను భజన చేసుకోనీయడం లేదంటూ రాజశేఖర్‌రెడ్డి ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో వారిద్దరిపై ఆదివారం లీలాప్రకాష్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● రేకలచేనులో పోలీసు పికెట్

ఈ నేపథ్యంలో భూపతిరెడ్డి సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి కడుపు, గొంతుపై కత్తితో దాడి చేశారు. గాయపడిన భూపతిరెడ్డి గట్టిగా కేకలు వేయడంతో వారు వెళ్లిపోయారు. గ్రామస్థులు భూపతిరెడ్డిని 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. ట్రైనీ ఐపీఎస్ హేమంత్, డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి, ఇన్‌ఛార్జి ఎస్ఐ రవీంద్రనాథ్ మంగళవారం ఉదయం రేకలచేను చేరుకుని గ్రామస్థులను విచారించారు. ఇదే గ్రామంలో 30 ఏళ్ల వ్యవధిలో రాజకీయ ప్రతీకార హత్యలు జరిగాయి. వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, నాగిరెడ్డి అనే వ్యక్తులు హత్యకు గురయ్యారు. ప్రస్తుతం గాయపడిన భూపతిరెడ్డి నాగిరెడ్డి కుమారుడు. ఈ క్రమంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

రాయితీపై బిందు సేద్యం పరికరాలు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాయితీపై బిందు సేద్యంపరికరాలు పొందవచ్చని జిల్లా సూక్ష్మనీటిపారుదల అధికారి సతీష్ తెలిపారు. ఐదు ఎకరాల లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90శాతం రాయితీ ఇస్తామన్నారు. 5 నుంచి 10 ఎకరాలున్న వారికి 70శాతం రాయితీ ఇస్తామన్నారు. ఐదు ఎకరాలున్న సన్నచిన్నకారు రైతులకు స్ప్రింకర్ పరికరాలపై 55శాతం, 5నుంచి పది ఎకరాలుంటే 45 శాతం రాయితీ పొందవచ్చునన్నారు. డ్రిప్, స్ప్రింకర్లు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, తహసీల్దారు ధ్రువీకరించిన భూమి యాజమాన్యపత్రం లేదా 1బీ రికార్డుతో రైతు సేవా కేంద్రాల్లో బయోమెట్రిక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని ఆయన వివరించారు.

వెదురుసాగుకు రాయితీ

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెదురు సాగు ప్రోత్సాహానికి రాయితీలు ఇస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖాధికారి దశరథరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు రంగంలో సాగు చేసేవారికి 50శాతం రాయితీ ఇస్తామన్నారు. ప్రభుత్వ రంగానికి వందశాతం సబ్సిడీ ఉంటుందన్నారు. నర్సరీ అభివృద్ధికిగాను ప్రైవేటు రంగానికి 50శాతం, ప్రభుత్వ రంగానికి వందశాతం రాయితీ ఉంటుందన్నారు. సీజనింగ్ ప్లాంట్, వెదురు డిపోలు, గోదాములు, ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రభుత్వ రంగంలో వందశాతం, ప్రైవేటు రంగంలో 50శాతంరాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

తిరుమలలో తమిళనాడువాసి మృతి

తిరుమల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఓ యువకుడు మంగళవారం తిరుమలలో మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. శ్రీవారి ఆలయం ముందున్న సహస్రదీపాలంకరణ మండపానికి సమీపంలో యువకుడు అచేతనంగా పడిఉంటాన్ని భక్తులు, సిబ్బంది గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. వైద్య సిబ్బంది వచ్చి పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డు ప్రకారం తమిళనాడులోని తిరువళ్లూరుకు చెందిన మోహనసుందర్(35)గా తేలింది. చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందినట్టు ప్రిస్కిప్షన్లు ఉండటంతో ఆనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. కొద్దిరోజులుగా తిరుమలలోనే ఉంటున్నట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని అశ్విని ఆస్పత్రికి తరలించారు. అతని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.

మోహనసుందర్ మృతదేహం



మద్యం తాగి డ్రైవింగ్ చేసినందుకు సేవా శిక్ష

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని బంగారుపేటకు చెందిన పవన్‌కుమార్ ఆదివారం రాత్రి మద్యం తాగి, పెద్ద శబ్దాలు చేసుకుంటూ బైక్ నడుపుతుండడంతో ఎస్ఐ సుబ్బారావు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రూ.500 జరిమానా విధించారు. అలాగే వెంకటగిరి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 8గంటల వరకు సేవ చేయాలని తీర్పు ఇచ్చారు. ఆస్పత్రిలో సేవ చేయకుండా తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లయితే రిమాండ్ విధిస్తామని చెప్పారు. అనంతరం నిందితుడిని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఎదుట హాజరుపరిచినట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

ముక్కంటి భక్తులకు మజ్జిగ పంపిణీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని క్యూలలో వేచి ఉండే భక్తులకు మజ్జిగ పంపిణీని మంగళవారం ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సుమారు 8 ఏళ్ల కిందట అప్పటి ఈవో భ్రమరాంబ భక్తుల వేసవి తాపం తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. అప్పట్లో స్వల్పసంఖ్యలో భక్తులకు మాత్రమే అమలు చేశారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. కొవిడ్ నుంచి మజ్జిగ పంపిణీ అటకెక్కింది. 2022 ఏప్రిల్ 17న వేసవి తాపంతో క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తులు ఆర్తనాదాలు పెట్టడం అప్పట్లో దుమారం రేగింది. అప్పటి దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ముక్కంటి ఆలయానికి వస్తున్నారన్న కారణంతో మండు వేసవిలో ఏప్రిల్ 17న క్యూలైన్లను కొంత సమయం స్తంభింపచేశారు. సరిగ్గా మంత్రి మహద్వారం వద్దకు చేరుకోగానే డౌన్‌డౌన్ అంటూ భక్తుల నుంచి ఆలయంలో నిరసన నినాదాలు మిన్నంటాయి. ఈ ఘటన తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఆ తర్వాత వేసవిలో క్యూలైన్లలో అవసరమైన నీటి సరఫరాపై దృష్టి పెట్టారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం సూచనలతో దేవదాయశాఖ అధికారులు ఆలయంలో భక్తులందరికి మజ్జిగ పంపిణీ చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆలయంలో మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సతీష్‌మాలిక్, సూపరింటెండెంట్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆలయ అధికారులు